

మరో అడుగు

– డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

ఇదీ అని చెప్పలేక భార్య పడుతున్న అవస్థని చూస్తూ తట్టుకోవడం కేశవరావు గారి వల్ల కాలేదు.

వెంటనే తమ ఫేమిలీ డాక్టర్ కి ఫోన్ చేసి పరిస్థితి అంతా చెప్పారు.

ఆయన ఇచ్చిన యాంటీ బయాటిక్స్ వల్ల నయం కలగలేదని చెప్పి, ఆవిడ ఎదుర్కొటున్న లక్షణాలన్నీ వివరంగా చెప్పారు.

" వెంటనే ఎక్స్ రే తీద్దాం కేశవ గారూ! యశోద గారిని రేపు తీసుకుని రాగలరా? ఎక్కువసేపు వెయిటింగ్ లేకుండా ప్రయారిటీలో చేయించేద్దాం " అన్నాడాయన.

" అయ్యో పరవాలేదు డాక్టర్, మాములుగానే చేద్దాం" అన్నారు కేశవరావు.

" పరవాలేదు కేశవ గారు, టెక్నీషన్ ని ఓ పావుగంట ముందుగా రమ్మంటాను. మనం మాములుగా క్లినిక్ తెరిచే టైముకి మీరు వెళ్ళిపోవచ్చు" అన్నాడాయన.

మర్నాడు తీసిన ఎక్స్ రే లో ఆందోళన కరమైన విషయాలేమీ కనరాలేదు. అది ఉపశమనంగా అనిపించింది అందరికీ.

కానీ ఊపిరి తిత్తుల్లో బాగా కఫం నిండి ఉందనీ, దానివల్ల శ్వాసకోశానికి సంబంధించిన ఇన్ఫెక్షన్ తీవ్రమయ్యే అవకాశం ఉంది కనక దాన్ని వెంటనే ట్రీట్ చెయ్యడం ముఖ్యమని ఆయన చెప్పారు.

'దానివల్లే ఛాతీ నొప్పి వస్తోందేమో!' అనుకున్నారు కేశవరావు గారూ, ఆయన కుటుంబం.

ఇన్‌ఫెక్షన్ ని తగ్గించడం కోసం మరిన్ని యాంటీ బయాటిక్స్, కఫం కరిగించడానికి దగ్గు మందులూ వచ్చి చేరాయి.

తేనే, అల్లం, నిమ్మరసాల్లాంటి ఇంటి చిట్కాలు సరే సరి.

" అమ్మా, మా అత్త కేరళ లో ఉంటుంది, అక్కడనించి పంపిన మూలికలపొడి అమ్మా ఇది. దీన్ని కషాయం చేసుకుని తాగితే మూడు రోజుల్లో ఎక్కడి దగ్గు అక్కడ మాయం అయిపోతుందంటమ్మా!" అంటూ కరుణ కేరళ ఆయుర్వేదపు మందు కూడా తెచ్చి ఇచ్చింది.

అసలు మందు మింగడమే నచ్చని యశోదకి ఇన్ని రకాల మందులు మింగవలసిరావడం తట్టుకోలేని పరిణామమైంది.

మందులూ, ఇంటి చిట్కాలూ, ఇవన్నీ చేరి తాత్కాలికపు ఉపశమనాన్ని ఇచ్చాయి. దానికే వారందరూ సంతోషపడ్డారు.

ముఖ్యంగా కేశవరావు.

కొద్దిగా దగ్గు తగ్గి నాలుగు ముద్దలు ఇష్టంగా తిన్న యశోదతో " చూశావా యశూ! నెమ్మదిగా నయమౌతోంది. నువ్విలా చిన్నపిల్లలా మారం చెయ్యకుండా మందులన్నీ టైము ప్రకారం వేసుకుంటే తొందరలోనే అన్నీ తగ్గిపోతాయి" అన్నారాయన ప్రేమగా భార్య చేతి గాజులు సవరిస్తూ.

దగ్గూ, కఫం తగ్గినట్టనిపించినా, ఆమెకి వచ్చే నొప్పి మాత్రం తగ్గలేదు.

ఛాతీ, భుజం, అక్కడనించి వెన్నులోకి పాకుతున్న ఆ నొప్పి వచ్చినప్పుడల్లా బాధతో విల విలలాడిపోవడం చూడటం కష్టమైంది ఆ కుటుంబానికి.

వీటన్నింటికీ తోడు బరువు తగ్గడం మొదలైంది.

తరచుగా కలుగుతున్న విపరీతమైన అలసటా, భరించలేని తలనొప్పి, గొంతులో ఇన్‌ఫెక్షన్, ఇలాంటి వాటివల్ల యశోద రోజువారీ సాధారణ జీవితం ఎన్నో ఒడిదుడుకులకి లోనవడం మొదలైంది.

తగినంత ఆహారం తినలేకపోవడం, నిద్ర లేమి, అలసట, నొప్పి, వీటన్నింటివల్లా ఇదీ అని చెప్పలేని బాధతో సతమతమవసాగింది యశోద.

కాస్త తగ్గుముఖం పడుతోందని సంతోషపడినంత సేపు పట్టలేదు. దాంతో కేశవరావు గారి దిగులు మళ్ళీ మొదటికొచ్చి

' అమ్మకేదో ఎక్కడో ఇన్‌ఫెక్షన్ సోకింది రా,అందుకే ఇంత బాధ పడుతోంది.ఏం చేద్దాం? ఎలా తగ్గుతుందో? మరో స్పెషలిస్ట్ దగ్గరికి తీసుకెళదామా? ' అని కొడుకుతోనూ

'మన డాక్టర్ గారినే అడుగుదామా, లేదంటే నీ సర్కిల్ లో ఎవరినైనా అడుగుతావా తల్లీ?" అంటూ కూతురితోనూ అనసాగారు.

రోజూ చూస్తూ ఉంటే వాళ్ళు గమనించని విషయం దాదాపు రెండు నెలల తర్వాత కలిసిన ఆవిడ స్నేహితురాలు ఆవిడను చూసి విస్తుపోయినప్పుడు మరింతగా అర్థం అయింది వారికి.

ఆ స్నేహితురాలు యశోద ని చూస్తూనే

" అరే యశూ, ఇంత వెయిట్ ఎలా తగ్గిపోయావ్? ఏదైనా స్పెషల్ డైట్ చేస్తున్నావా? ఒంట్లో బావుంది కదా? ఎన్ని కిలోలు తగ్గిపోయావ్? నీకెందుకు అసలు డైట్ చెప్పు?" అంటూ ప్రశ్నలు వేసింది.

ఆరోజే కేశవరావు గారికి విపరీతమైన అనుమానం వచ్చింది.

" తెలియదు సరూ, నేను ఏ డైట్ చెయ్యడం లేదు. ఎక్కడనించి వచ్చిందో తెలియని ఇన్‌ఫెక్షన్ తినేస్తోందనుకో నన్ను" అంది యశోద.

"మందులు, యాంటీ బయాటిక్స్ పనిచెయ్యడం లేదు, అదేమిటో తెలీదు. తినాలని అనిపించడంలేదు, నొప్పి, దగ్గుల వల్ల నిద్ర ఉండడం లేదు"అన్నారు కేశవరావు.

ఆ రాత్రి యశోద పడుకున్నాకా, ఆమెకి నిద్రా భంగం కలగకుండా పిల్లలిద్దరికీ మొబైల్ లో మెసేజ్ పంపి, ముగ్గురూ కలిసి గార్డెన్ లో కలిశారు.

పిల్లలిద్దరితోనూ తనమనసులో ఉన్న బాధనంతా చెప్పి, కళ్ళ నీళ్ళ పర్యంతం అయిపోయారు.

" ఇన్నేళ్ళ మా జీవితంలో మీఅమ్మనెప్పుడూ ఇలా చూడలేదు. అసలేమైందో తెలియడం లేదు. సమస్య ఏమిటో తెలిస్తే కనీసం పరిష్కారం కనుక్కోవచ్చు, కానీ ఇక్కడేం జరుగుతోందో తెలియడమే లేదు, దాదాపు రెండు నెలలు దాటలేదూ? " అంటూ దిగులు పడ్డారు.

ఆయన బాధ అర్థం చేసుకున్నట్టుగా మౌనంగా విన్నారు ఇద్దరూ.

" అవును నాన్నా, మీరన్నది నిజమే! అమ్మనిలా చూడడం అస్సలు బావులేదు. నవ్వుతో మెరిసిపోయే అమ్మ ముఖం చూసి ఎన్నాళ్ళయిందో అనిపిస్తోంది నాకు!" అంటూ మాట్లాడుతున్న యామిని చేతి మీద తన చేత్తో అనునయంగా తడుతూ.

" ఒక సారి అమ్మకి మొత్తం చెక్ అప్ చేయిద్దాం నాన్నా! ఊరికే దగ్గనీ, నొప్పనీ కాకుండా మొత్తం హెడ్ టు టో (Head to Toe) చెక్ అప్ చేయిస్తే మంచిదని నా అభిప్రాయం. కానీ అమ్మ ఒప్పుకుంటుందో, లేదో!" అన్నాడు యష్.

" నువ్వన్నది నిజమే అన్నా! ఇట్ ఈజ్ అబవుట్ టైం షి గెట్స్ సీరియస్ అబవుట్ హర్ హెల్త్" అంది యామిని.

పిల్లల మాటలు వింటూ అవునన్నట్టు తల ఊపారు కేశవ రావు. కళ్ళ జోడు తీసి చేతి రుమాలుతో కళ్ళూ, ముఖం తుడుచుకుంటూ.

" మీరన్నది నిజమే! అసలు ఏమవుతోందో తెలుసుకోవడం చాలా అవసరం. ముఖ్యం. అమ్మనెలా ఒప్పించాలో ఆలోచిద్దాం. చూద్దాం, ఏదో ఒక దారి దొరక్కపోదు" అన్నారు ఆశగా.

దానిక్కారణం ఉంది.

డాక్టర్ల దగ్గరకి వెళ్ళడానికి యశోద త్వరగా ఇష్టపడదు.

తనకున్న పరిజ్ఞానం వల్ల చాలా రకాలైన మంచి ఆహారపుటలవాట్లు, ఆరోగ్యపరిరక్షణా చర్యలు తీసుకుంటుంది.

క్రమం తప్పని హెల్దీ లైఫ్ స్టైల్ పాటిస్తుంది కనక తనకి డాక్టర్ల అవసరం లేదని చాలా బలంగా నమ్ముతుంది.

అందుకే అంత ప్రతిఘటన.

అంతకు మించి మరే ఇతర కారణం లేకపోయినా, ప్రస్తుతం తను ఉన్న పరిస్థితిలో ఇబ్బంది పెట్టకుండా ఒప్పించడం ఎలా ? అన్నదే వారి ఆలోచన.

ఏదో ఒక దారి దొరక్కపోదు! అని ఆయన అన్న మర్నాడే అనుకోని సంఘటన జరిగింది.

అది అన్నింటినీ మార్చేసింది.

ముఖ్యంగా యశోద ఆలోచనని, ఆమె అభిప్రాయాలనీ.

ఆ రోజు ఉదయాన్నేతెల్లవారుఝామునే మొదలైన దగ్గుతో నిద్రాభంగమైన యశోద బాత్ రూములోకి పరిగెత్తుకుంటూ వెళ్ళింది.

అప్పుడే ఆమె గమనించిన విషయం తన కఫం లో కనిపించిన రక్తం.

ఎప్పుడూ జ్వరం అనేది కూడా ఎరగని యశోద గత రెండు నెలలుగా తరచుగా అనారోగ్యంతో సతమతమవుతు విసిగిపోయి ఉంది. దానికి తోడు ఇది ఎదురవడంతో ఆమె విపరీతం గా భయపడిపోయింది.

ఒక్కసారిగా షాక్ కి గురైంది.

తగని ఆందోళన కుదిపేసింది.

భయంతో పెద్దగా కేక వేసి భర్త ని పిలిచించి.

ఆమె గొంతులో ధ్వనించిన ఆందోళనని గమనించిన ఆయన ఒక్క పరుగున ఆమె వద్దకి వెళ్ళారు.

ఎప్పుడూ ఎంతో శాంతంగా, ధీరోదాత్త లా ఉండే భార్య ఆ క్షణంలో చిగురుటాకులా వణికిపోవడం చూసి తల్లడిల్లిపోయారు.

గత రెండు నెలలుగా పీడిస్తున్న అనారోగ్యం, అలసట ఆమెని ఎంత అల్లకల్లోలం చెయ్యడం చేసిందో ఆయనకి తెలియనిది కాదు.

అందువల్లే అంత కంగారు పడిందని ఆయనకి అర్థం అయింది.

అయితే తను కూడా కంగారు పడితే మరింత బెంబేలు పడుతుందని ఆమె భుజం చుట్టూ చెయ్యి వేసి, అనునయించి నెమ్మదిగా నడిపించి తమ గదిలోకి తీసుకు వచ్చి మంచం మీద కూర్చోబెట్టారు.

పక్కనే ఉన్న జగ్ లోంచి గ్లాస్ లోకి నీళ్ళు వంచి యశోద చేతికి ఇస్తూ. "ముందు కొద్దిగా నీళ్ళు తాగు!" అన్నారు

కొద్దిగా తాగి తేరుకునేలోపు చిన్న చేతి టవల్ తో ముఖాన్ని సున్నితంగా తుడిచి ముంగురులని చేతితో చెవి వెనగ్గా సర్ది, భార్యను చూసి చిన్నగా నవ్వారు.

"భయపడ్డావా యశూ, దగ్గి దగ్గి అలసి పోతున్నావు కదూ, గొంతు పొడి బారి అలా జరిగి ఉంటుంది. డాక్టర్ తో మాట్లాడతాను గా. కొద్దిసేపు పడుకుంటావా?" అన్నారు.

ఆమె తలూపింది.

మంచం మీద వాలాక మెత్తటి దుప్పటి కప్పి, ఫాన్ తగ్గించారు..

యశోద కి నిద్ర వచ్చినట్టుంది.

ప్రశాంతంగా ఉన్న ముఖాన్ని చూస్తూ' ఏమైంది తన యశూకి? అనుకున్నారు బాధగా.

ఆయనకి మరి నిద్ర రాలేదు.

కాస్త గ్రీన్ టీ కలుపుకుని బయట ఉయ్యాల మీద కూర్చున్నారు. మనసులో ఎన్నో ఆలోచనలు.

వెంటనే ముక్కూ, గొంతు స్పెషలిస్ట్ (ENT) డాక్టర్ దగ్గరకి తీసుకువెళ్ళారు.

తొలి పరీక్షల్లో పెద్దగా ఏమీ తేలలేదు.

కానీ ఆ స్పెషలిస్ట్ డాక్టర్ ఒక పట్టాన రాజీ పడే వ్యక్తి కాదు. ఆమె చెప్పిన లక్షణాలకి ఆయనకి కలిగిన అనుమానాలకి పరీక్షలో ఏమీ తేలకపోవడం ఏమిటో అర్థం కాలేదు.

టీ.బీ టెస్ట్ కూడా నెగెటివ్ రావడం మరింత ఆశ్చర్యం కలిగించింది అందరికీ.

ఎప్పుడూ మందులన్నా, పరీక్షలన్నా ఇష్టపడని యశోద తనంతట తానే టీ. బీ టెస్ట్ జరిపించమని కోరడం విని కేశవరావు కూడా ఆశ్చర్యపోయారు.

" నా కేమవుతోందో, ఏం చేస్తే తగ్గుతుందో తెలియని ఈ తెలియని స్థితి కంటే, కనీసం ఇదీ అని తెలియడం మంచిది కదా డాక్టర్. అందుకని ఈ దగ్గు, కఫం లో పడుతున్న రక్తం ఇవన్నీ టీ.బీ లాటి దాని వల్ల కలుగుతున్నాయని మీకనుమానం ఉంటే, వెంటనే పరీక్ష చేయిద్దాం. కనీసం అది పాజిటివ్ వస్తే మనకొక దారి దొరుకుతుంది" అందావిడ.

కానీ ఆ పరీక్షలో కూడా నెగెటివ్ రావడం తో వారికి ఏదో తెలియని ఆందోళన కలిగింది.

అది చూసి డాక్టర్ బర్వే ఛెస్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ షా దగ్గరకి తీసుకువెళ్ళమని చెప్పారు.

ఆయన వెంటనే ఎండోస్కోపీ చేసి చూద్దామన్నారు.

అనడమే కాక వెంటనే చేయించారు. చిత్రంగా ఆ పరీక్షలోనూ ఏ రకమైన క్లూ కూడా దొరకలేదు.

ఇన్ని చేయించినా ఏ పరీక్షలోనూ ఏమీ తేలడం లేదంటే చాలా విచిత్రం గా ఉంది అన్నారు డాక్టర్ షా.

“ఒక సారీ సీ.టీ (CT) స్కాన్ చేయి ద్దాం కేశవ్ గారూ!”. అన్నారు డా.షా

"మీరేదంటే అదే, కనీసం విషయం అర్థమైతే పరిష్కారాలూ, చికిత్సామార్గాలూ తెలుస్తాయి. ఏం జరుగుతోందో తెలియకుండా తనిలా బాధ పడుతుంటే చూడడం నావల్ల కావడం లేదు" అన్నారు కేశవ్.

" ఐ అండర్స్టాండ్. మరేమీ పరవాలేదు. మీరు ధైర్యంగా ఉండండి. ఈ పరీక్షా ఫలితం వచ్చేస్తే మనకి అంతా అర్థం అయిపోతుంది" అన్నారాయన అనునయంగా.

ఆయన అనుభవంలోంచి వచ్చిన అనుమానమే నిజమవుతుందని ఆ పరీక్షా ఫలితం వచ్చేదాకా తెలియనేలేదు. ఎవరికీ తట్టనేలేదు.

అలాంటి ఫలితం అది.

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments